క్లుప్తంగా

31న స్పాట్ అడ్మిషన్లు


పుత్తూరు పాలిటెక్నిక్ కళాశాల

పుత్తూరు: పట్టణంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.వి.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై పాలిసెట్లో అర్హత పొందని అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లుతోపాటు అడ్మిషన్ ఫీజు రూ.4,700, కౌన్సెలింగ్ ఫీజు రూ.1,100 వెంటనే చెల్లించాలని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.350 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 90102 22155 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

నేడు దుర్యోధన వధ

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో ఉన్న శ్రీకృష్ణ సమేత ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా పట్టాభిషేకం, సాయంత్రం అమ్మవారి అగ్ని గుండ ప్రవేశం చేస్తున్నట్లు చెప్పారు.

ట్రిపుల్ ఐటీకి తూగుండ్రం విద్యార్థిని

గంగాధర నెల్లూరు: తూగుండ్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన మిట్ట కొత్తూరు గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీ సుధా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న లక్ష్మీసుధా పాఠశాలలో చురుకుగా చదువుకునేదని, తన ప్రజ్ఞా పాటవాలతో ఈ అవకాశం లభించిందని ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కలియంబాకంలో పారిశుధ్య పనులు


కలియంబాకం: కాలువలో పూడిక తీత పనులు

విజయపురం: కలియంబాకం పంచాయతీలో పారిశుధ్య పనులు నిర్వహించారు. శనివారం సర్పంచ్ విద్యభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శాంతి వీధుల్లో పర్యటించారు. మురికి కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను జేసీబీ సాయంతో తొలగించారు. తాగునీటి కొళాయిలు, మురికి గుంటల వద్ద ఆయిల్ బాల్స్ వేశారు. ఇంటి పరిసరాలలో ఉన్న నీటి తొట్టెలను శుభ్ర పరిచారు. వీధిల్లో పేడదిబ్బలు తొలగించి బ్లీచింగ్ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటిలో పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ బాటిల్స్, పాత టైర్లు, పేడదిబ్బలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

పుత్తూరులో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పుత్తూరు: పట్టణంలోని తిరుపతి రోడ్డులోని ఆక్రమణలను శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి రోడ్డులోని డ్రైనేజీని పూర్తిగా ఆక్రమించి దుకాణాలు వెలిశాయన్నారు. పట్టణ జనాభా పెరిగిన నేపథ్యంలో మురుగునీరు, వర్షపునీరు పోవుటకు అనుగుణంగా డ్రైనేజీని పూర్తి స్థాయిలో శుభ్ర పరుస్తున్నట్లు తెలిపారు. ఆక్రమణల తొలగింపు కొనసాగుతుందని, దుకాణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇంద్ర, పారిశుధ్య కార్యదర్శి మునస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి

యాదమరి(పూతలపట్టు): రసాయన ఎరువులు వాడకుండా రైతులు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ప్రకృతికి మేలని మండల వ్యవసాయాధికారి చరిత తెలిపారు. శనివారం మండలంలోని పెరుమాళ్లపెంట గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు మేలైన పంట యాజమాన్య పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చి లాభం పొందే అవకాశం ఉంటుందని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పీఆర్పీ పార్వతి, రైతుభరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉంది.. జాగ్రత్త


రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

విజయపురం: వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే ఈ సీజన్‌లో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతోపాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాలకు గురికావడం ఖాయం. పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో ఒకటికి రెండు, మూడు సార్లు పరిశీలించుకుని నీళ్లలోకి దిగాలి. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండటం, పొలాల్లో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండడం, ఇళ్లకు సమీపంలో నుంచే తీగలు వెళ్లడం, స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోవడం తదితర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వర్షాకాలంలో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే స్థానికంగా ఉన్న విద్యుత్ అధికారులకు, సిబ్బంది తెలియజేయాలి.

వర్షాకాలంలో చేయకూడని పనులు

- వర్షకాలంలో విద్యుత్ స్తంభాలను తాకే ప్రయత్నం చేయకూడదు.
- విద్యుత్ స్తంభాలకు వేసిన స్టే వైర్‌ను తాకడం, కేబుల్ టీవీ వైర్లను తాకే ప్రయత్నం చేయకూడదు.
- సబ్ స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు. మరమ్మతులు చేయకూడదు.
- వర్షకాలంలో వీధుల్లో గాలికి వైర్లు తెగిపడి ఉన్నా...కిందకు వేలాడుతున్నా స్థానికంగా ఉన్న అధికారులకు తెలియజేయాలి.
- వ్యవసాయ పొలంలో మోటార్ వైర్లు కింద పడి ఉంటే గుర్తించాలి.

ఇళ్లలో జాగ్రత్తలు అవసరం

- ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీరు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌ను తాకకూడదు.
- ప్లగ్‌లను స్విచ్ ఆఫ్ చేయకుండా తీయకూడదు.
- ఇంటిలో విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు సొంత ప్రయోగం చేయకూడదు. సిబ్బందికి తెలియజేయాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. స్తంభాలు పడిపోయినా, తీగలు కిందకు వాలిపోయినా, తెగి పడిపోయినా వెంటనే అధికారులకు తెలియజేయాలి. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు ఉండదు. వర్షం పడుతున్నప్పుడు పొలాలకు వెళ్లకుండా ఉండడం మంచిది.

– చంద్రబాబు, ఏఈ, విజయపురం

విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలి



స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులతో అధికారులు

పుత్తూరు: ప్రతి విద్యార్థి స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా శిక్షణ పొందడం ద్వారా సేవా దృక్పథం అలవర్చుకోవచ్చునని డీవైఈఓ ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొత్తగా మూడు గైడ్స్ యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఒక్కో యూనిట్‌లో 32 మంది విద్యార్థుల వంతున మొత్తం 96 మంది గైడ్స్‌ను సభ్యులుగా ఎంపిక చేశారు. వీరందరికీ జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణకు అలవాటు పడాలని, అందుకు స్కౌట్ అండ్ గైడ్స్ మంచి వేదిక అన్నారు. చిన్నతనం నుంచి సమాజ సేవ చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా క్రమశిక్షణతో కూడిన సేవామార్గం అలవరుతుందని తెలిపారు. సమాజంపై అవగాహన ఏర్పడుతుందని వివరించారు. అంతే కాకుండా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందగలుగుతారని వెల్లడించారు. అనంతరం విద్యార్థుల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలరాజు, హెచ్ఎం శోభనాదేవి, సీనియర్ గైడ్స్ కెప్టెన్ సునీత, నాగరత్నం, రెడ్డిరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


మెడికల్ క్యాంప్‌లో సూచనలిస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ

నగరి: ఆరోగ్యమే మహా భాగ్యమని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ అన్నారు. శనివారం రాష్ట్ర, జిల్లా లీగల్ కమిటీల ఆదేశాల అనుసారం, నల్సా 2015 పథకం కింద ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, నగరి ఏరియా ఆస్పత్రి మెడికల్ సిబ్బంది సంయుక్తంగా నత్తంకండ్రిగ ఎస్టీ కాలనీలో నిర్వహించిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు అందజేశారు. ఈ శిబిరంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, బార్ అసోసియేషన అధ్యక్షుడు జగదీష్, న్యాయవాదులు బాబు, మహదేవన్, ఐబాబు, హనీఫా, రాము పాల్గొన్నారు.

చెరకు పంటలో తెగుళ్లు నివారించాలి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నగరి: చెరకు పంటలో తెగుళ్లు, పురుగులను నివారించుకోవాలని వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.వసంత, కేఆర్ ఠాగూర్, పి.నాగమణి అన్నారు. శనివారం నగరి, కార్వేటినగరం, ఎస్ఆర్ పురం, పాలసముద్రం మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉన్న చెరకు తోటలను వారు పరిశీలించారు. ముఖ్యంగా వీసీఎఫ్ 517, సీఓసీ 13339, ఎస్16 రకాల పంటల్లో మొవ్వ కుళ్లు, పసుపు ఆకు తెగులు, రసం పీల్చే పురుగులను గమనించారు. వీటి నివారణను రైతులకు సూచించారు. ఒక లీటరు నీటిలో కార్బండిజమ్ ఒక గ్రాము గానీ ప్రొపికొనజోల్ ఒక మిల్లీ లీటరుతోపాటు మోనోక్రోటోఫాస్ 2 మిల్లీ లీటర్లు కలిపి గానీ, ఇమిడాక్లోపిడ్ 0.4 మిల్లీ లీటర్లు కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. విత్తన చెరకు నాటుకునే రైతులు ఒక ఎకరానికి 200 కిలోల యూరియాను మూడు సమభాగాలుగా చేసుకొని నాటిన 30,60,90 రోజులకు వేసుకోవాలన్నారు. 300 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 75 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌లను ఒక ఎకరానికి చెరకు నాటే సమయంలో భూమిలో వేసి కలియదున్నాలన్నారు. వ్యాధి నిరోధకత కలిగి అధిక దిగుబడిని ఇచ్చే రకాలైన 2016టీ7, 2005టీ16, 200ఐ46, సీఓసీ11015, సీఓ18009, సీఓ86032, సీఓ14012 రాకలు వేసుకోవాలని సూచించారు. చెరకు ఫ్యాక్టరీ ఏజీఎం(కేన్) వరదరాజన్, చంద్రయ్య, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

నగరి: నియోజకవర్గ స్థాయిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ఆర్డీఓ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరి మండలం సత్రవాడ(1), టీఆర్ కండ్రిగలలో హెల్పర్ పోస్టుకు, నిండ్ర మండలం శ్రీరామాపురం ఎస్టీ కాలనీలో మినీ వర్కర్ పోస్టుకు, కొప్పేడు దళితవాడ, పాదిరి గ్రామాల్లోని హెల్పర్ పోస్టుకు, విజయపురం మండలంలో ఎల్లసముద్రం మినీ వర్కర్ పోస్టుకు, శ్రీహరిపురం హెల్పర్ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 7 పోస్టులకు 13 మంది హాజరయ్యారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగశైలజ, బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీ వైద్యుడు రమేష్ కుమార్, సీడీపీఓ కృష్ణవేణి ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు.

ఆస్తి కంటే ఆరోగ్యం ముఖ్యం


విజయపురం: ఉచిత వైద్య శిబిరం

విజయపురం: ఆరోగ్యం కంటే ముఖ్యమైంది ఏదీ లేదని, పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని నగరి సివిల్ కోర్టు జడ్జి విష్ణువర్మ తెలిపారు. మండలంలోని ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నగరి సివిల్ కోర్టు జడ్జి విష్ణువర్మ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే సక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సోమశేఖర్, విష్ణుప్రియ, ఎంపీడీఓ బ్రహ్మయ్య, హెడ్‌కానిస్టేబుల్ చెంగయ్య, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మూర్తి, బార్ అసోయేషన్ అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యాయులు ఈజీ బాబు, మహాదేవన్, సర్పంచ్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి కానిక్‌రాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల శక్తి సామర్థ్యాలను వెలికి తీయండి


ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు పంపిణీ

పుత్తూరు: మెరుగైన విద్యా బోధనల ద్వారా విద్యార్థుల్లోని అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలని ఉపాధ్యాయులకు డీవైఈఓ ప్రభాకర్‌రాజు దిశానిర్దేశం చేశారు. శనివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గత 9 రోజుల క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ టీచ్ టూల్ ట్రెనింగ్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ తొమ్మిది రోజుల శిక్షణా తరగతుల్లోని ఫీడ్ బ్యాక్‌ను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో విద్యా బోధనల్లో మార్పు కనబడాలని కోరారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకొన్న దానికి నాగరికతను జోడించి విద్యా ప్రమాణాలను పెంచాలని సూచించారు. బోధనల ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, మాస్టర్లు రమేష్, బాలసుబ్రమణ్యం, హిమగిరి, వేణుగోపాల్, పుత్తూరు, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు, వడమాలపేట మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణకు హెల్మెట్ విధిగా ధరించాలి


మాట్లాడుతున్న జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర, సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు, కక్షిదారులు

పుత్తూరు: అతివేగం అనర్థాలకు మూలమని, అయితే దీన్ని నియంత్రించడానికి హెల్మెట్ రక్షణ కవచంగా నిలుస్తుందని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం కోర్టులో న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ హెల్మెట్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 3,703 ప్రమాదాల్లో 3,042 ప్రమాదాలు హెల్మెట్ ధరించకపోవడం ద్వారా మరణాలు సంభవించినట్లు తేలిందని వెల్లడించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కుటుంబ పెద్ద బాధ్యతగా వ్యవహరిస్తేనే ఆ కుటుంబం క్షేమంగా ఉంటుందని అన్నారు. మోటార్ సైకిల్ వినియోగదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా రోడ్డు మరణాలను నియంత్రించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏజీపీ ఉదయ్‌కుమార్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న నగరి సివిల్ జడ్జి

నిండ్ర: గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నగరి సివిల్ జడ్జి విష్ణువర్మ అన్నారు. శనివారం మండలంలోని కొప్పేడు పంచాయతీ వేదాంతపురం ఎస్టీకాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల కోసం అందించే సంక్షేమ పథకాలు, రాయితీలను వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా గిరిజన కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యాధుల నుండి కాపాడుకోవాలన్నారు. గిరిజన కాలనీల్లో వైద్యం కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల్లో ఎవరైనా డయేరియా బారిన పడితే ప్రభుత్వం రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగమణి, ఎంపీడీఓ భవాని, ఎస్ఐ రామచంద్ర, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలి



నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి

కార్వేటినగరం: నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ జల్ శక్తి అభియాన్‌లో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, సాంప్రదాయ నీటివనరుల పునరుద్ధరణ, పారుదల సామర్థ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ నీటి సంరక్షణ పై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని, గ్రామాల్లో కూడా ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి నీటి చుక్కను ఒడిసి పడితేనే భవితకు నీటి భరోసా అన్నారు. క్యాచ్‌ది రెయిన్ అనే అంశంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలసుబ్రమణ్యంఆచారి, అధ్యాపకులు డాక్టర్ సీఎస్ లత, డాక్టర్ హరిబాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ బాబు, ఎస్.కార్తీక్, రాజశేఖర్, జోగిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం

- భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు


ధ్వజారోహణంలో ఉభయదారులు, తెప్పోత్సవానికి సిద్ధం చేసిన తెప్ప

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణం కార్యక్రమంతో శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వేద మంత్రాల నడుమ ఆడికృత్తిక ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంకురార్పణ, గణపతి హోమం, భరణి అభిషేకం, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివార్లను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ధ్వజారోహణ కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్, ఆలయ మాజీ చైర్మన్ రవియాదవ్, డాక్టర్ దీపక్‌రెడ్డి, పళనిరెడ్డి, సాయి, అర్చకులు హరి పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలు

వార్షిక ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి ఆనుకుని కుమారగిరిపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ప్రధాన కూడళ్లలోని స్వామివారి ప్రతిమలతో కూడిన భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. అదే విధంగా స్కంధ పుష్కరిణి చుట్టూ, పుష్కరిణిలోని నీరాళి మండపాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. పుష్కరిణిలో తెప్పోత్సవాలు నిర్వహించడానికి టీటీడీ సహకారంతో తెప్పను సిద్ధం చేశారు.

నేడు ఆడికృత్తిక మహోత్సవం

గంగాధర నెల్లూరు: కోటగరం పంచాయతీ ఎట్టేరి వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడి కృత్తిక మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. నేడు వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి అభిషేక పూజలు, భరణి కావడి చెల్లింపులు, 29న పాలాభిషేకం కావడీ చెల్లింపులు ఉంటాయి. మంగళవారం స్వామివారికి కల్యాణోత్సవం చేపట్టనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం 100 గొల్లపల్లి జైన్ ఫాం ఫ్రెష్ ఫ్యాక్టరీ, చిత్తూరు నగరానికి చెందిన ఓఎం రామదాసు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం రాత్రి ద్రౌపది మానసంరక్షణ వీధి నాటకం ఉంటుందని తెలిపారు.

సిద్ధేశ్వర కొండపై..

వింజం పంచాయతీ సిద్ధేశ్వర స్వామి కొండపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడి కృత్తిక మహోత్సవం జరుగుతుందని ధర్మకర్త ఎ.నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు నేడు, రేపు స్వామివారి ఆలయంలో కావడి చెల్లింపులు కార్యక్రమం, భక్తులకు అన్నదాన కార్యక్రమం, రాత్రి హరికథ, పంచ కల్యాణి వీధి నాటకం ప్రదర్శింపబడుతుందని తెలిపారు.

ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాస్తున్నారు


మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి, అధికారులను నిలదీస్తున్న వెదురుకుప్పం సర్పంచ్ శిల్ప

- మండల సమావేశంలో అధికారులపై సభ్యుల ధ్వజం

వెదురుకుప్పం: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాల్సింది పోయి ప్రజాప్రతినిధులు హక్కులు, విధులను అధికారులు కాలరాస్తున్నారని అధికారులపై సభ్యులు, సర్పంచ్‌లు ధ్వజ మెత్తారు. శనివారం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెదురుకుప్పం పంచాయతీకి ఆదాయం వచ్చే వారపు సంత, వాణిజ్య సముదాయం రూములను వేలం వేయకుండా ఎందుకు కుంటి సాకులు చెబుతూ ఆపేశారంటూ సర్పంచ్ శిల్ప నిలదీశారు. వేలం పాటను ఎందుకు నిలిపారంటూ ఈఓపీఆర్డీ పురుషోత్తంను ప్రశ్నించారు. కనీసం సర్పంచ్‌గా తనకు తెలియకుండా ఎందుకు నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్‌కి తెలియకుండా వాయిదా నిర్ణయం ఎలా నిర్ణయిస్తారని అడిగారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సమస్యలు ఉందనే కుంటి సాకులు చెబుతున్నారంటూ మండిపడ్డారు. అదేవిధంగా బొమ్మయ్యపల్లె పంచాయతీలోని దేవళంపేటలో రూముల వేలం పాటని కూడా ఎమ్మెల్యే మనుషులు అడ్డుకోవడంతో రూములకు తాళాలు వేసుకుని వచ్చారంటూ సర్పంచ్ గోవిందయ్య ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే థామస్ ఒత్తిడితో అన్యాయంగా కేసులు పెడుతున్నారని, సమస్యల గురించి అడిగితే బెదిరిస్తున్నారనే కోణంలో అధికారులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీకి కనీసం వార్డు మెంబర్‌గా కూడా అర్హత లేని వాళ్లకు సమాచారం ఇచ్చాని పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ సభ్యుడు తోకల మురళీరెడ్డి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో శిలాఫలకాలకు వేసిన ముసుగును కోడ్ ముగిసినా తీసేందుకు ఎవరికి భయపడుతున్నారోనని అధికారులను అడిగారు. ఈఓపీఆర్డీ పురుషోత్తం మాట్లాడిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓ పేద కుటుంబంపై అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేయడం హేయమైన చర్య అని సర్పంచ్ శిల్ప అన్నారు. ఎమ్మెల్యే థామస్ చెప్పాడని అధికారులు కొందరిని టార్గెట్ చేసుకుని బెదిరిస్తే తాము కూడా తిరగబడాల్సి వస్తోందని బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్ అన్నారు. నల్లవెంగనపల్లె పంచాయతీలో జేఎల్ఎం విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో తాగునీటికి, వీధి దీపాల అమర్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ పుష్ప అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ట్రాన్స్‌కో ఏఈ కూడా సక్రమంగా స్పందించడం లేదని నిలదీశారు.

ఎంపీడీఓ వరప్రసాద్ కలుగజేసుకుని జేఎల్ఎం సక్రమంగా పనిచేయకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళితే ఉద్యోగం పోతుందని హెచ్చరించారు. డీడీఓల పరిధిలోనే సచివాలయ సిబ్బంది పని చేయాలన్నారు. గతంలో నడుపుతున్న బస్సులను పునరుద్ధరించాలని కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్ ఆర్టీసీ అధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ నాగరాణి మాట్లాడుతూ అందరి సహాయ సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కాదని ఏ పని చేయకూడదని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు రమణ, విజయ, ఎంపీటీసీలు రాధిక, చిన్నబ్బ, మునిచంద్రారెడ్డి, గుణశేఖర్, హరి, సర్పంచ్ సంఘం అధ్యక్షురాలు భారతి, ఎంఈఓ మహేశ్వరరావు, ఏఈ తిమ్మరాజు, ఏఓ వనిత, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.